
రూ.5,000 తృతీయ బహుమతి
పొందిన కథ

# పుట్టిల్లు

డాక్టర్ కె.వి. రమణారావు



"అత్తయ్యా! గోపుపాలెం నుంచి రామచంద్ర బాబాయి గారొచ్చారు" పెద్ద కోడలు కమ పిలుపు విని పార్వతమ్మ తన గదిలోంచి డ్రాయింగ్ రూంలోకొచ్చింది. తమ్ముడు, తన పెద్ద కొడుకు మురళి సోఫాల్లో కూర్చొని మాట్లాడుకుంటున్నారు. ఇదే మురళి చిన్న పిల్లవాడుగా ఉన్నప్పుడు రామచంద్ర గేట్లో కన్పించగానే 'అమ్మా మామయ్యొచ్చాడు' అంటూ సంబరంగా పరిగెత్తుకుంటూ తన దగ్గరికొచ్చేవాడు. తమ్ముడు పల్లెనుంచి తెచ్చే చెరకుముక్కలు, పచ్చి వేరు సెనక్కాయలు, అ సంద కాయలు, కొత్త బెల్లం కోసం పిల్లలు పోట్లాడుకునేవాళ్లు. పార్వతమ్మ నవ్వుకుంది.

# సి.పి.బ్రౌన్ అకాడమీ - నవ్యవీక్లి కథల పోటీ

''ఏరా ఇప్పుడా రావడం. పొద్దున్నుంచీ చూస్తున్నాం. సుగుణా ఏదీ? వూళ్లో అంతా బాగున్నారా?''

''బాగున్నావాక్కా, ఏదీ పొద్దున్నే సుగుణా వాళ్ల పిన్ని కూతురింటికి పోతిమా ఏదిగో ఇప్పుడయ్యింది బయటికొచ్చేటప్పటికి. సుగుణ్ణి రేప్పొద్దున్నే దింపుతామనిరి. ఈ సిటీలో అన్నీ దూరాలే గదా. రేపు రాత్రికి మళ్లా కాశీకి బయలుదేరాల్ల''

చాలా రోజుల తర్వాత వచ్చిన తమ్ముడిని పరీక్షగా చూసింది పార్వతమ్మ. మనిషి చిక్కాడు. జుట్టు పలచబడింది. మొహంలో మునుపటి కళ లేదు. ఓడిపోయి సంధికొచ్చిన రాజులాగున్నాడు.



''కూర్చోమ్మా నీకోసమే చూస్తున్నాం'' అని తల్లితో అని- ''అయితే మామయ్యా ఆంజనేయులు కొంటానన్నాడా మన దేవళం తోట పొలం. ఎంతి స్తానన్నాడు'' అంతకుముందు జరిగిన సంభాషణని పొడిగించాడు మురళి.

''వాడు మా పీనాసిరాప్పా! మనం అది ఎప్పటికైనా అమ్ముకునేకే అని తెలిసి కష్టమ్మీద మూడు లక్షల దాకా వచ్చినాడు''

''అదేంటి మామయ్యా ఎకరానికి లక్ష లెక్కన అయిదయినా వస్తుందనుకున్నామే. బోరు బావి, చెట్లుగూడా వున్నాయి''

''అవేం చెట్లు లేరా రాగి, నేరేడు, రేగు ఇట్లాటివే గదా. ఆ నాలుగు వేప చెట్లకేమైనా విలువుంటుందేమో. నీటి వసతి గూడా అంతంత మాత్రమే గదా. పైగా ఆ చెట్లు కొట్టేకిలేదని, దేవళాన్ని నడపాలని షరతు బెడితిం గదా''

''ఎవడు ఆ కోటయ్య కొడుకు ఆంజనేయులేనా? వాడికైతే అమ్మనే వద్దురా. వడ్డీల మీద వడ్డీలు గట్టి వాడు జనం రక్తం పీలుస్తాడు. ఆ పాపిష్టి డబ్బు మనకొద్దు'' పార్వతమ్మ కోపంగా మాట్లాడింది.

''అమ్మా ఇన్నాళ్లాయె. ఎన్నో కండిషన్లు పెట్టి అమ్మడానికి వొప్పుకున్నావు. మళ్లీ కొనేవాడి గుణగణాలు బావుండాలనే ఈ కొత్త షరతు ఎక్కడిదే?'' మురళి నవ్వాడు.

''వూర్లో భూములు కొనే పెద్ద మనుషులెవరున్నారే? అంతో ఇంతో స్థోమతున్నోళ్లే భూముల్ని అమ్ముకొని టౌన్లు చేరుతున్నారు. ఇపుడు సేద్యం ఎవరికీ గిట్టుబాటు గావడం లేదక్కా. రైతులంతా కూలీలై దేశాలు బట్టి పోతున్నారు. బిడ్డ పెళ్లి ఎట్లో కానిస్తిని. దేవుని దయ వల్ల శంకరానికి బెంగుళూర్లో వుద్యోగమొచ్చే. 'బెంగుళూరుకి రాకుండా ఆ పల్లెలో అగచాట్లెందుకని వాడనె' సంవత్సరం నుంచి ఇష్టపడితేనా భూమి తల్లిని అమ్మాలన్నా, విడిచి వెళ్లాలన్నా బాధే. ఏంజేస్తాం'' వేదాంతంలోకి దిగాడు రామచంద్ర.

''ఆ అయిదెకరాలూ నా పసుపు కుంకుం కిందొచ్చింది. పోయిపోయి ఆ ఆంజనేయులు చేతిలో ఎట్లా పెట్టేదిరా''

''ఆ తోటకు మనకు బంధం శానా గట్టిదిరాప్పా మురళి. మీ అమ్మయితే ఆ తోటలోనే పెరిగిందనుకో. మన ముత్తాతలు మన కులదేవతకు అందులోనే రావి చెట్టు కింద మనిషెత్తు దేవళం గట్టినారు. మీరేమో సిటీలో స్థిరపడితిరి. ఇప్పుడింగ నేను గూడా వెళ్లిపోతాండడంతో ఆమెకు వొప్పుకోక తప్పలేదు'' గొంతులో ఏదో అడ్డుపడ్డట్టు ఆగి అక్క వైపు తిరిగి ''ఇంగేదీ మనసులో పెట్టుకోకే. చేయగలిగినన్నాళ్లు చేసినాము. అట్లే పెడితే పాడయిపోతాయి. ఆంజనేయులుకి భయం జాస్తి, వాటిని బాగానే చూసుకుంటాడులే'' ముక్తాయించాడు రామచంద్ర, తల వూపాడు మురళి.

''అత్తయ్యా ఇవాళ శనివారం, మరిచిపోయారా డ్రైవర్ రెడీగా వున్నాడు. బయల్దేరాలి, మళ్లీ చీకటి పడుతుంది''కమల పూలసజ్జతో వచ్చింది. పార్వతమ్మ లేచింది.

***

ముందుకు పరుగెడుతున్న కారు కిటికీలోంచి వెనక్కు వెళ్తున్న ఎత్తైన భవనాలు పార్వతమ్మలో జ్ఞాపకాలై లోతుల్లోంచి పైకొస్తున్నాయి. 'తన ఊరు, ఇల్లు, తల్లి, తండ్రి, పొలాలు, ఊరు చివరి దేవళం తోట, ఎత్తైన చెట్లు, పచ్చని పొలాలు, శుభ్రమైన వీధులు అన్నీ. చాలా వరకు పూరిళ్లే అయినా కళ్లాపి చల్లిన ముంగిళ్లలో, పూలచెట్ల పెరళ్లతో తీర్చిదిద్దినట్టుండేవి. ఎక్కువ భాగం రైతులవి. చేతు వృత్తులవాళ్లవో పదిళ్లు. దాదాపు అందరికీ ఎకరమో అరో తక్కువ గాకుండా భూ వసతి ఉండేది. అంతా కలివిడిగా వుండేవాళ్లు. కాస్త కలిగిన నాలుగు కుటుంబాల్లో తమదీ ఒకటి. అయితే ఆ తేడా ఎన్నడూ తెలిసేదీ కాదు. మనిషి విలువ డబ్బుతో, హోదాతో కొలుస్తారని తెలియని అమాయకత్వం. తను తన స్నేహితురాళ్ల బాల్యమంతా దేవళం తోటలోనే గడిచింది. తెలియని వయస్సులో ఆటల్లోంచి స్నేహంలోకి అక్కడే ఎదిగారు. అలాంటి తోటను ఇప్పుడు అమ్మాల్సిరావడంతో పార్వతమ్మ రాజీ పడలేకపోతోంది. కానీ తమ్ముడన్నట్టు తను చేయగలిగిందేమీ లేదు. తన పిల్లలంతా ఇక్కడే ఇళ్లు కట్టుకున్నారు. ఎక్కడి హైదరాబాదు ఎక్కడి అనంతపురం జిల్లా..'

''అత్తయ్యా కోవెలకొచ్చాం దిగండి'' కమల పిలుపుతో వర్తమానంలోకి వచ్చింది పార్వతమ్మ. కోవెల ఎత్తు మీద వుంది. చాలా మెట్లు ఎక్కి వెళ్లాలి. శనివారం కాబట్టి భక్తుల హడావిడి జాస్తిగా వుంది.

మెట్లెక్కుతున్న పార్వతమ్మలో మళ్లీ తెరలు తెరలుగా ఆలోచనలు. 'అసలు పెళ్లైనపుడే తనకు ఆ వూరితో బంధం బలహీనమైపోయింది. తన భర్తకి నగర జీవితం, ఆఫీసు వ్యవహారాలు తప్ప పల్లెటూళ్ల పట్ల ఆసక్తి లేదు. అసలు తనని పుట్టింటికి పంపిందెన్నిసార్లు? పుట్టింటి వాళ్లకి విలువిచ్చిందెన్నడు? తన పిల్లలు మంచి ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. తనని నెత్తిన పెట్టుకుని చూసుకుంటారు. అయినా ఏదో సన్నని వెలితి. ముప్పై ఏళ్లుగా వెంటాడుతున్న వెలితి. తిరుపతిలో కాలేజి జీవితం ముగియక ముందే పెళ్లి. తర్వాత భర్త, ఇల్లు, పిల్లలు. అన్నీ బావున్నా తనకంటూ వేరే జీవితం లేకపోవడం వల్లనా? భర్త కాలం చేసి రెండేళ్లయింది. తన పల్లకీ మోసే బాధ్యత పిల్లలు తీసుకున్నారు. ఇపుడు తనకు పుట్టింటి గుర్తుగా మిగిలిన ఆ ఒక్క తోటని అమ్మకానికి పెట్టింది.'

''అత్తయ్యా... యిటు... యిటు...'' కమల మాటలతో

చేస్తాం. ఎట్లా తీరుస్తాం'' పార్వతమ్మ వింటోంది, వినడం లేదు.

''అందుకే శంకరం చదువై పోతానే సేద్యం జేస్తానని ఎగిర్తే, వద్దురా యాదన్నా వుద్యోగం జూసుకోరాప్పా అన్నా'' రామచంద్ర నోటికి చెయ్యడ్డం పెట్టుకుని ఆవలించాడు.

''వస్తానే అక్కా రైలుకి టైమవుతావుంది'' అంటూ లేచి వెళ్లబోతూ ఏదో గుర్తొచ్చినట్టు ఆగి జేబులో చెయ్యిపెట్టి ఓ కవరు తీసి ''మరిచిపోయినానే, నీ స్నేహితురాలు జానకి, ఆమేనే రంగాచారి కూతురు, నీకిమ్మని ఈ జాబిచ్చింది. మొన్నొచ్చి ఒక వారము వూర్లో వుండిపోయిందిలే. వాళ్ళ అన్నదమ్ములంతా భాగాలు పంచుకొని అమ్మేసుకొని పోయిరి. ఎటువంటి భూమి'' స్వగతంలా అంటూ కవరు అక్కచేతిలో పెట్టి వెళ్లిపోయాడు.

పార్వతమ్మ పెద్ద లైటార్పి, రీడింగ్ ల్యాంపు వెలిగించి కవరు చించి ఉత్తరం తీసి చదువుకుంది. కాసేపాగి మళ్లీ చదువుకుంది. కాసేపయ్యాక లేచి హాల్లోకొచ్చి పెరటి తలుపు తెరుచుకుని వెనక వరండాలో కూర్చుంది. పారిజాతం పూలవాసన మంచులా చిక్కగా కమ్ముకుని సప్తమినాటి చంద్రుడు మసకేశాడు. చీకట్లో రాత్రి నిశ్శబ్దంతో కలిసి విహరిస్తోంది. పార్వతమ్మ మైకం కమ్మినట్టుగా తనలోకి జారిపోయింది.

'ఏం పూలు అవి అబ్బ ఎంత ఎర్రగా వున్నాయో.. పార్వతీ ఈ కొత్త తీగ ఎక్కడిదే.. ఈ అలివేలికి ఎప్పుడు పూలగొడవే..గంగరేగు పళ్లు దోరగా వున్నాయి రాయి వేస్తున్నా దూరం జర గండి..జలజల..రామలక్ష్మీ నువ్వు రాయేస్తే అన్నీ ఆకులే రాల్తాయి..కిల కిల..నేరేడు పళ్లన్నీ అయిపోయాయే జయా. అయిపోక ఇంగ వుంటాయా తల్లీ నువ్వు బడెగ్గొట్టి యీడే గూర్చొని తినేస్తే..పోతే కళా అదో బాల.. ఆ బాగిమానుకిందుంది.. 'బాగిమాను కింద వుయ్యాలో బాలమ్మ బిడ్డలు దయ్యాలో!' పక పక..కొట్టద్దే కొట్టద్దే ఇంగ అననంటే అనను.. ఇదో చామంతులు, కనకాంబరాలు..జానకీ పూజెయ్యాలే..పార్వతీ రావే..అసీనా నీళ్లు తీసుకురావే..అబ్బ కాలువ నీళ్లల్లో ఆ కనిక రాళ్లు చూడు ఎట్లా మెరుస్తున్నాయో.. ఈ సెలవులు రేపటితో ఆఖరు..మళ్లా బడి..పిలకైవారు..నాలుగో క్లాసు..నిర్మల..కళావతి కుల్సుంచి..అందరూ రావల్ల పూజ మొదలైతాంది.. గణ గణ'

''అయ్యో అత్తయ్యా మీరిక్కడ కూర్చున్నారా? అలాగే నిద్రబోయినట్టున్నారు, గదిలోకి పదండి, చలిగాలి'' కోడలి పిలుపుతో పార్వతమ్మ మగత చెదిరింది.

గదిలో మంచం మీద గోడకానుకుని కూర్చుని దూరంగా వెళ్లిపోతున్న రాత్రిని దగ్గరగా వస్తున్న చంద్రుడిని చూస్తోంది పార్వతమ్మ. ఏవేవో ఆలోచనలు, జ్ఞాపకాలు ఎండిపోతున్న నదికి కలిగే అనుభూతులు.

''అయితే పార్వతీ పెళ్లి కుదిరి వెళ్లిపోతున్నావుగా చదువు మానేస్తావా?''

''ఎందుకు మానేస్తుంది? తిరుపతిలో వుండే కాలేజీలు హైదరాబాద్‌లో లేవా?''

## రచయిత పరిచయం



పుట్టింది, పెరిగింది కడప జిల్లా, సుండుపల్లె మండలం తిమ్మసముద్రం గ్రామం. హైస్కూలు నుంచి పి.హెచ్.డి. దాకా కడప, తిరుపతిలలో. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో వృక్షశాస్త్ర అధ్యాపకుడిగా ఉద్యోగ పర్వం ఆరంభం. ప్రస్తుతం కళాశాల విద్యా శాఖ కార్యాలయంలో అకడెమిక్ ఆఫీసర్‌గా పని.

సాహిత్య అధ్యయనం అభిమాన విషయం. జిడ్డుకృష్ణమూర్తితత్వం, బడే గులాం ఆలీఖాన్,కపిలవాయి రామనాథ శాస్త్రిల గానం ఇష్టం. విద్య, పర్యావరణం, మనస్తత్వశాస్త్రాలపైన ఆసక్తి.

రాసిన కథలసంఖ్య తక్కువ. ఈ కథల పోటీలోబహుమతి ఇచ్చిన సి.పి.బ్రౌన్ అకాడమీ, నవ్య వీక్లీకి కృతజ్ఞతలు.

–డాక్టర్ కె.వి.రమణారావు

''మీ ఆయన్ది పెద్ద వుద్యోగమటగా, ఎంత పెద్దది ఈ గంధం చెట్టంత పెద్దదా?''

''ఏయ్ ఈ గంధం చెట్టు నేను నాటిందే! ఎంత పెద్దయిందో చూడు''

''నువ్వు పెరగలేదమ్మా తాటిచెట్టంత, హసీనా గూడా పెళ్లి కూతురయింది''

''పార్వతీ, నువ్వు, జానకీ తప్ప మేమేవ్వరం పక్కూరి హైస్కూలు దాటలేదు''

''ఎంత చదివినా ఆడపిల్లలు చేసేదేముందీ పల్లెల్లో, పుట్టే ఇంటిని బట్టి బతుకు''

''బాలవాళ్ల బావ మెడకు తప్పదు. ఏమే బాలా''

''వాడితో పాటే పాటే నేనూ. వాడి సిరే నా సిరి వాడి చాపే నా చాప''

''అబ్బో శూర్పణక సీతమ్మోరైంది''

''అలివేలుదే అదృష్టం. పువ్వులాంటి పిల్లకి పండు లాంటి మొగుడు, పక్కనే చిట్లూరు. మంచి వ్యవసాయ కుటుంబం''

''పెళ్లైతే మనందరం విడిపోవాల్సిందేనా. ఈ తోట ఏమైపోతుంది? ఆడపిల్లలకే ఈ దిగులు''

''ఎక్కడికి పోతామే సగం మంది ఇక్కడే. మిగతావాళ్లూ చుట్టు పక్కలే, చిట్లూరు, కాకపోతే చిన్నకల్లు మహా అయితే తాడిపత్రి''

''పార్వతీ దూరంగా పోవడం లేదా. ఏం పార్వతీ పెళ్లయి వెళ్లిపోతే ఎప్పుడైనా మనూరొస్తావా? మేం గుర్తుంటామా?''

''పెళ్లైతే మాత్రం అన్నీ వదులుకుంటామా. ఎవరెక్కడున్నా ఎల్లా వున్నా మనం కలుస్తూనే వుంటాం. ఈ తోట ఈ దేవళం వున్నంత వరకూ. ఇది మనందరికీ పుట్టిల్లు''

***

రెండు వారాలు గడిచి కాశీ యాత్ర ముగించుకు వచ్చిన మర్నాటి సాయంకాలం రామచంద్ర అక్క ఇంటికి వచ్చేసరికి, అక్కడ పరిస్థితి గంభీరంగా ఉంది. అందరూ హాల్లో కూర్చొని ఏదో తీవ్రమైన విషయం గురించి మాట్లాడుకుంటున్నట్టు అనిపించింది రామచంద్రకి. హైదరాబాద్‌లోనే ఉన్న పార్వతమ్మ పెద్ద కూతురు సరోజ పూనా నుంచి చిన్న కొడుకు సుధీర్, చెన్నైలో ఉన్న చిన్న కూతురు మాలతి కూడా వచ్చి వున్నారు.

''మీ కాశీయాత్ర బాగా జరిగిందా బాబాయ్'' ముందుగా కమల మాట్లాడింది అతని చేతిలోని సంచీ అందుకుని మంచినీళ్లిస్తూ. తన రాక ప్రభావం అంతగా లేకపోవడం చూసి తాను రాకూడని టైంలో వచ్చానేమో అన్న సందేహం కలిగింది రామచంద్రకి.

''ఏం కాశీనో ఏమో లేమ్మా. పూజలన్నీ బాగానే జరిగినాయనుకో. ఏమైనా మన దేవళాలు వేరు అవి వేరు. ఏదో జన్మలో ఒకసారన్నా కాశీకి పోకుండా మోక్షం లేదంటారు గానీ, మన బుగ్గ రామలింగేశ్వరస్వామి దేవళం మాదిరి యాడుందమ్మా'' తన విషయం మాట్లాడే అవకాశం రావడంతో కొంత తేరుకున్నాడు.

''చూడు మామయ్యా అమ్మ ఏమంటుందో. నువ్వయినా చెప్పు ఆమె మనసు మార్చడం మా వల్ల కాలేదు. నిన్నట్నుంచీ చూస్తున్నాం'' మురళి విషయంలోకి వచ్చాడు గాని విషయమేమిటో చెప్పలేదు.

''అమ్మ మమ్మల్నందర్నీ వదిలేసి ఒక్కతే వెళ్లి గోవుపాలెంలో వుండి పోతుందట, అదీ ఎన్నాళ్లో తెలియదంట'' మాలతి గొంతులో దుఃఖం, నిష్ఠూరం పలికాయి.

''అదిగాదు మామయ్యా నువ్వెళ్లినప్పట్నుంచి అమ్మ ఎవరితోనూ సరిగ్గా మాట్లాడలేదు. ఏదో ఆలోచిస్తూ కూర్చునేది. మొన్న నన్ను, అన్నను కూర్చోబెట్టి ఈ మాట చెప్పింది. తోట అమ్మదంట! మీ ఇంటి పక్కన తన వాటాకొచ్చిన పెంకుటింట్లో వొంటరిగా వుంటానని చెప్పింది. భయమేసి చెల్లిని తమ్ముడిని రమ్మన్నాం'' వివరించింది సరోజ.

''అదేందక్కా మొన్ననే గదా తోట అమ్మేయడానికి వొప్పుకున్నావు. మళ్లీ ఏమయింది. నువ్వుపోయి ఒంటిగా అక్కడుండమేమిటీ'' కలవరపడుతూ అడిగాడు.

''ఇన్నాళ్లాయే. కొన్నేళ్లయినా ఒంటరిగా వుందామని'' నిర్లిప్తంగా నవ్వింది పార్వతమ్మ. ఎవ్వరూ నవ్వలేదు. వరుసగా ప్రశ్నల పరంపర మొదలైంది.

''అక్కడేముందే ఒక పాత పెంకుటిల్లు. అదేమన్నా ఆశ్రమమా! మామయ్యా వాళ్లు వెళ్లిపోతున్నారు, ఇక్కడేమైనా జరిగిందా, నీ వుద్దేశ్యమేమిటో సరిగ్గా చెప్పు''

''మనవళ్లతో హాయిగా వుండక ఈ వయసులో ఈ స్వతంత్రంగా వుండాలనే కోరికెందుకే అమ్మా''

''మా వలన ఏమయినా ఇబ్బంది కలిగిందా అత్తయ్యా''

పార్వతమ్మ దీర్ఘంగా నిట్టూర్చి స్వగతంలా మాట్లాడింది ''మీ దగ్గర నాకేం కష్టముందిరా. పువ్వుల్లో పెట్టి చూసుకుంటున్నారు. ఈ రోజుల్లో ఇలా వుండడం నా భాగ్యం. మీ నాన్నా అంతే నాకే లోటు రానివ్వలేదు. నేను మీకు చేయాల్సిందంతా చేశాను. కానీ నేను నేనుగా ఇన్నాళ్లూ చేసిందేమీ లేదు. ముప్పయేళ్లుగా పల్లకీలో తిరిగింది చాలు. ఇప్పుడైనా కొంచెం నేల మీద నడుద్దామని పించింది. ఇన్నాళ్లు అవకాశం రాలేదు. ఇప్పుడైనా చేయగలనేమోననిపించింది''

''ఈ వయసులో అదీ ఆ పల్లె కొంపలో. ఇక్కడే ఏదైనా చేయొచ్చుగా''

''మీ నాన్న గూడా ఇలాగే అనేవారు. మా వూర్ని పల్లె కొంపంటే నాకు బాధగా వుంటుంది. అది నా పుట్టిల్లు. నేను పెరిగింది, ఎదిగింది అక్కడే. పల్లెల్నీ అందరూ వదిలిపెట్టి వెళ్లిపోతే అవేమవుతాయి నా అవసరం ఇప్పుడక్కడ ఏర్పడింది''

''నీ అవసరమా, అక్కడా ఏమిటది?అక్కడ మనవాళ్లెవరున్నారని?''

''నా స్నేహితురాళ్లు, వాళ్ల బిడ్డలు కష్టాల్లో వున్నారు. కుటుంబాలు కూలిపోతున్నాయి. దిక్కు తోచని స్థితి. నేనేదైనా చేయాలి. వాళ్లనాదుకోవాలి. ఇది నాకోసం చేస్తున్నానో వాళ్లకోసం చేస్తున్నానో తెలియదు''

''అమ్మా ఆ పని గొప్పవాళ్లు, సంఘాలే చేయలే కున్నాయి. కావాలంటే ఇక్కడినుంచే డబ్బు సహాయం చెయ్యి. నువ్వొక్కతివే వెళ్లి ఏం చేస్తావు?''

''నాకు తెలీదు. ముందు వెళ్లి వాళ్లకు తోడుగా వుంటాను. ఆలస్యం చేయకుండా ఏదో చేయాలి. నాదే పరిష్కార మార్గమని కాదు. ఆ చిన్న పెంకు టిల్లు, తోట, నాకొచ్చే పెన్షన్ ఇవే ప్రస్తుతం నాతో వున్నాయి''

''మేమంతా నీతో లేమా'' కళ్లు తుడుచుకుంది మాలతి.

''మీరు నా బరువు మోయడం సమంజసమే గాని, నేనెత్తుకునే బరువును మీ మీద మోపలేను''

''వాళ్లే ముఖ్యమంటావా, నిజంగా నువ్వెళ్లక పోతే గాని జరగదంటావా'' సుధీర్ ప్రశ్నించాడు, ''ఇదంతా ఇంకా మాకయోమయంగానే వుంది''

పార్వతమ్మ లేచి తన గదిలోకెళ్లి చేతిలో మడత పెట్టిన కాగితంతో తిరిగొచ్చింది. ''ఇది నా స్నేహి తురాలు జానకి రాసిన వుత్తరం. మొన్న రామ చంద్ర వచ్చినపుడు వాడితో పంపింది'' అని కమలకిచ్చి ''రెండో పేరా నుంచి గట్టిగా చదవమ్మా'' అంది కళ్లు మూసుకుని కుర్చీలో జేరగిలబడుతూ.

''ప్రియమైన పార్వతికి'' అంటూ ప్రారంభించి రెండో పేరాకి వెళ్లింది కమల.

''మన వూరొచ్చి నాలుగు రోజులైంది. మా అన్నయ్యలు మిగిలిన ఆ ఒక్కిల్లు అమ్మేస్తూంటే ఆ సందర్భంగా వచ్చాను. మనవూరితో నాకున్న ఆ ఒక్క బంధం తెగిపోయింది. ఆడపిల్లకి పుట్టినపుడు పేగు బంధం, పెళ్లప్పుడు ఇంటి బంధం, స్వంత వూర్లో ఆస్తి పోయినపుడు ఊరి బంధం, ఇట్లా బంధాలన్నీ తెగిపోతాయేమో. అట్లని వాళ్లు స్వతంత్రులూ కాలేరు. మరో చోట ప్రవాసుల్లా కాలం గడుపుతారు. ఈ కాలం పిల్లలు కొంత నయ మనుకో.

ముఖ్యంగా రాయడమేమంటే మన వూరి పరి స్థితి ఏమీ బాగాలేదు. వూరంతా ఎండిపోయినట్టు దిగాలుగా వుంది. వ్యవసాయం చేతి వృత్తులు బొత్తిగా కలిసి రావడం లేదు. ఏవో కొన్ని కుటుంబాలు మాత్రమే ఫరవాలేదు. గో సంపద పుష్కలంగా వుండడం వల్ల మన వూరికి గోవుపాలె మనే పేరొచ్చిందని మనమనుకునే వాళ్లం. మొన్న కనుమ పండుగ రోజున పట్టుమని పది ఆవులు కూడా కనిపించలేదు.

మన స్నేహితురాళ్ల పరిస్థితి మరీ దయనీ యంగా వుంది. ఒక్కోరిది ఒక్కో కష్టం. కొందరు అత్తింట్లు పోగొట్టుకుని పుట్టిల్లు చేరారు. అలివేలు భర్త అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకున్నాడంట. ఆమె ఎక్కడుందో ఎవరికీ తెలీదు. రామలక్ష్మీ పరి స్థితీ అంతే. ప్రతి సంక్రాంతికి మనకు ప్రత్యేకంగా బట్టలు నేసిచ్చిన సుబ్బయ్య కుటుంబం ఇల్లు ఎటో వెళ్లిపోయింది. కళావతి మొగుడు ఎక్కడికెళ్లాడో ఆమెకే తెలియదు. బ్యాంకు వాళ్లు ఇంటి చుట్టూ తిరుగుతున్నారు. చిన్న రైతు కుటుంబాల్లో మగ వాళ్లు బతుకుదెరువును వెతుక్కుంటూ కూలీలుగా వెళ్లారు. ఆడవాళ్లు పిల్లల్ని పెట్టుకొని రోజుల్ని గడుపు తున్నారు. ఎవ్వరి మొహాల్లోనూ కళాకాంతులు లేవు.

మన దేవళం తోటకెళ్లాను. కళావతి, జయ, బాల, కుల్సుంచి కూడా వచ్చారు. తోట చిన్న అడవి లాగుంది. పూల చెట్ల బదులు ముళ్లపొదలు, తుప్పలు వున్నాయి. దేవళం దగ్గర ఫరవాలేదు. దీపం పెడుతున్నారు. అందరం కూర్చొని పాత రోజుల్ని తలుచుకుని కళ్లనీళ్లు పెట్టుకున్నాము.

వీళ్లని తలుచుకుంటే చాలా వేదనగా వుంది. ఒకే కుటుంబంలా ఎలా వుండేవాళ్ళం. ఏదో చేయా లని వుంది గాని ఏమీ చేయలేను. మనిద్దరం తిరు పతి కాలేజిలో చదువుకున్నాం.మంచి పుస్తకాలు చదివాం. చదువు అయిపోయాక ఏవేవో చేయాలను కున్నాం. బ్రతుకు గాడిలో పడి ఏమీ చేయలేకపోయాం. మన వాళ్లకి కుటుంబమే పరిధి. దాన్ని దాటని వ్వరు. నేను మరీ పంజరంలో చిలుకని. మనకంటే తక్కువ స్థాయి వారితో స్నేహాన్ని ఒప్పుకునే సంస్కారం మన సంఘానికి ఇంకా రాలేదు. పక్క వాళ్లలా వున్నా సుఖంగా వుండగలరు.

పార్వతీ మొదట్నుంచీ నువ్వంటే మా అందరికీ ఇష్టం. నువ్వే శాంతంగా నిలకడగా వుండేదానివి. మొన్న కూడా అందరూ నిన్నే తలుచుకున్నారు. మన వాళ్లకి ఇప్పుడు ముఖ్యంగా కావాల్సింది మానసిక స్థైర్యం. కష్టాలని తట్టుకుని జీవించే ఆత్మ విశ్వాసం. జీవితం చాలా విలువైనది, వీలయితే నీవొకసారి వెళ్లి వాళ్లను ఓదార్చి ధైర్యం చెప్పిరా. ఆ అవసరమైతే ఒక్కొక్కరినీ కోల్పోవాల్సి వస్తుందేమో. మనమంతా కేవలం విడిపోయిన బాల్య స్నేహి తులమై మిగిలిపోయాం. ఇంతకంటే ఎక్కువ రాసే గుండె బలం నాకు లేదు...నీ జానకి''

హాలంతా గాఢమైన నిశ్శబ్దం ఘనీభవించింది. నిశ్శబ్దపు ఒత్తిడికి అందర్లో ఏవో మంచుగడ్డలు విరిగి కరిగినట్టయింది.

''నా చుట్టూ నాతో పెరిగిన మనుషుల కోసం అక్కడి నుంచే కొత్తగా ఏదో మొదలు పెట్టాలను కుంటున్నాను. ఈ ప్రయాణం ఎన్నాళ్లో తెలియదు'' పార్వతమ్మ గొంతు గద్గదమైంది ''ఒకవేళ ఈ ప్రయ త్నంలో నేనోడిపోతే మీకు భారం కాను'' మాటలాగి పోయాయి. పార్వతమ్మ కనురెప్పలు బరువుగా తెరచింది.

★

